

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని కోట్‌పల్లి సర్పంచ్ విజయలక్ష్మి మంగళవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్రంలో మత్స్యసహకార సంఘం మాజీ అధ్యక్షుడు బందెయ్య ఉన్నారు. - బంట్వారం



కొడంగల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న పున్నంచంద్ లాహోటీ. చిత్రంలో పార్టీ నాయకులు బస్వరాజ్, మోహన్‌రావు, కృష్ణయాదవ్, చంద్రప్ప, నర్సింహులు, లక్ష్మయ్యగౌడ్, శేఖర్ తదితరులు ఉన్నారు. - కొడంగల్ రూరల్

క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: పాత తాండూరులో నిర్వహించనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కోసం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు. మంగళవారం స్థానిక బొడ్రాయి కమిటీ సభ్యులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి ఆహ్వానించేందుకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నందున తన వంతు సహాయంగా రూ.2 లక్షలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందులో స్టేషన్ హనుమాన్ దేవస్థాన చైర్మన్ సంజీవరావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, హన్మంతు తదితరులు ఉన్నారు.

రాజీయే రాజమార్గం

అనంతగిరి: రాజీయే రాజమార్గమని, అందుకు ప్రజాకోర్టును ఆశ్రయించాలని ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని కోర్టుల్లో కక్షిదారులు ఎవరైనా రాజీ కుదుర్చుకునేందుకు మక్కువ చూపితే.. ఈ నెల 9న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

పరిగిలో..

పరిగి: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న జిల్లాలోని అన్ని కోర్టుల్లో అదాలత్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఇరువురు రాజీ పడాలని అనుకునే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధి నాగిరెడ్డిపల్లికి చెందిన పలువురు మంగళవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో వెంకటయ్య, నందిగామ సిద్దు, సిద్దిక్, రాజు, అంజిలయ్య, కృష్ణ తదితరులు పార్టీలో చేరారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ తెలిపారు. ఇందులో పార్టీ మండల నాయకులు రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



నియామకపత్రం అందజేస్తున్న మాజీమంత్రి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహ్మద్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. పార్టీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడిగా మంగళవారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ మాట్లాడారు. బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్సారీ, ఖాజాపాషా, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి దూరంగా.. ఆటలకు నోచుకోక

- నిరుపయోగంగా క్రీడా మైదానాలు
- మండల పరిషత్ కార్యాలంలోనే స్పోర్ట్స్ కిట్స్
- వినియోగానికి మొగ్గుచూపని యువత
- లక్షలు ఖర్చు చేసినా.. నెరవేరని సర్కారు లక్ష్యం

మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది సర్కారు. అందుకు రూ.లక్షలు వెచ్చించింది. కానీ మైదానాలకు అనువైన ప్రభుత్వ స్థలం లేక, ఊరికి దూరంగా మైదానాలు ఏర్పాటు చేసింది. వసతులు కొరవడి, క్రీడా పరికరాలు లేకపోవడంతో అవి బోసిపోయాయి. దీంతో వాటిని వినియోగించేందుకు యువత ఆసక్తి చూపకపోవడంతో అవి నిరుపయోగంగా మారిన వైనంపై 'సాక్షి' కథనం..



ఏన్కతల గ్రామానికి దూరంగా ఉన్న మైదానం (ఇన్‌సెట్లో) మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న స్పోర్ట్స్ కిట్లు

మోమిన్‌పేట: పల్లె ప్రాంత యువతీ, యువకులు క్రీడలకు దూరమవుతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందుకు ఒక్కో ప్రాంగణానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు నిధులను వెచ్చించింది. కానీ అన్ని నిధులు ఖర్చు చేసినా అభివృద్ధికి నోచుకోక పోగా యువతకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని, అందుకు కారణం జీపీ పరిధిలో 0.20గుంటల ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడమే అని పలువురి అభిప్రాయం. ఊరికి దూరంగా కిలో మీటరు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ప్రాంగణాలు ఏర్పాటు చేయడం వలన అక్కడికి ఎవరూ వెళ్ల లేకపోతున్నారు. దీంతో ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అంతే కాకుండా క్రీడా పరికరాలు మండల కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసినా.. గ్రామాలకు పంపిణీలో జాప్యం వలన, అవి నెలన్నర నుంచి మండల పరిషత్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. దీంతో సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు.

నామ మాత్రంగా..

కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు నామ మాత్రంగానే తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు రాసి పెట్టేశారు. కానీ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఉపయోగ పడే విధంగా ప్రాంగణాలు లేకపోతే, అవి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని పలువురు వాపోతున్నారు. ఏర్పాటు చేసిన ప్రాంగణాలను అభివృద్ధి పరిస్తే.. అవి వినియోగంలోకి రావడంతో పాటు, ఆటల్లో మెరికల్లాంటి ఆణి ముత్యాలను వెలికి తీయవచ్చునని విద్యావంతుల అభిప్రాయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రాంగణాలకు తగిన ఏర్పాటు చేయడంతో పాటు, పరికరాలు అందజేసి క్రీడల్లో యువతను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

"త్వరలో పంపిణీ




క్రీడా మైదానాలను ప్రభుత్వం ప్రతి జీపీ పరిధిలో ఏర్పాటు చేసింది. సర్కారు స్థలం ప్రభుత్వ భూమి అందుబాటులో లేని గ్రామాల్లో దూరంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అందుకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అయింది. మిగతా అభివృద్ధి గ్రామ పంచాయతీ చూసుకోవాలని, స్పోర్ట్స్ కిట్స్‌ను ప్రభుత్వం పంపిణీ చేసింది. కానీ వాటి పంపిణీకి సంబంధి ఎలాంటి ఆదేశాలు రాలేదు. త్వరలో పంపిణీ చేస్తాం. - శైలజారెడ్డి, ఎంపీడీఓ, మోమిన్‌పేట

వానొస్తే బురదమయం

అడుగుతీసి వేయలేని దుస్థితి

పరిగి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పరిగి మండలం నర్సయ్యగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు చిత్తడిగా మారి.. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ గ్రామ ప్రజలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడితే రోడ్డంతా బురదమయం అవుతుందని, బీటీరోడ్డు వేయాలని ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానిక ప్రజలు ఆరోపించారు. ఇటీవల గ్రామానికి బీటీరోడ్డు మంజూరు అయినప్పటికీ.. ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. షాద్‌నగర్ రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లేందుకు 4 కిలో మీటర్ల దూరం ఉంటుందని, దారి మొత్తం గుంతలుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది మారిందని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బీటీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సయ్యగూడ రోడ్డు దుస్థితి

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే అంతే

వికారాబాద్ అర్బన్: రోడ్డు మధ్యలో ఉన్న మురికి కాలువపై వేసిన పై కప్పు కుంగిపోవడంతో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రి మార్చురి, రైల్వే ఇంజినీరింగ్ కార్యాలయం, ప్రభుత్వ కంటి ఆస్పత్రి, సెయింట్ జూడ్స్ పాఠశాలకు వెళ్లాలంటే ఈ మార్గం గుండా వెళ్లాల్సిందే. ఇలా నిత్యం రద్దీగా ఉండే రహదారిపై గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ప్రమాదాన్ని సూచిస్తూ.. కొందరు గుంతలో చెక్కలు తదితర వాటిని వేసినప్పటికీ.. ఆదమరిచి ఎవరైనా వాహనం నడిపితే ప్రమాదం బారిన పడక తప్పదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- విద్యార్థులకు చదువుతో పాటు మిగతా అంశాలపై అవగాహన కల్పించాలి
- తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఓటు నమోదు చేసుకోవాలని, అదే విధంగా మీ కుటుంబాల్లో అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ మురళీధర్

ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డించడంలో నిర్లక్ష్యానికి తావులేదని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగారాం నాయక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి జయంతి



మాణిక్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రమేష్ మహరాజ్ తదితరులు

తాండూరు: మాజీ మంత్రి మాణిక్‌రావు జయంతి మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని మల్లప్ప మడిగె వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాణిక్‌రావు తనయుడు, తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు ఉత్తంచంద్, జనార్దన్‌రెడ్డి, హబీబ్‌లాల నివాళి అర్పించారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంఘం ఆధ్వర్యంలో మాణిక్‌రావు జయంతిని నిర్వహించారు. ఇందులో సంఘం తాండూరు నియోజవర్గ కన్వీనర్ రాజ్‌కుమార్, బీసీ నాయకులు, ముదిరాజ్ సంఘం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్పీ రవికాంత్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మొయినాబాద్‌రూరల్: కురుస్తున్న వర్షాలకు పాత ఇళ్లలో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు, వేలాడుతున్న తీగలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మూసీ వాగు నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, చాకలిగూడ, వెంకటాపూర్, అమ్డాపూర్, కాశింబౌలి, బాకారం, నాగిరెడ్డిగూడ మీదుగా హిమాయత్‌సాగర్‌లోకి వరద ప్రవహిస్తోందని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తించని ప్రభుత్వం
- సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

కుల్కచర్ల: సర్వశిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. దీంతో వారికి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, విద్యా వ్యవస్థ ఉన్నతికి కృషి చేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు

గుర్తించని ప్రభుత్వం

పరిగి: సర్వశిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల కన్నా ఎక్కువ పనిచేస్తున్నా.. తమ సమస్యలను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల సమగ్ర శిక్ష జాక్ సభ్యులు మోహన్, శ్రీశైలం, చంద్రశేఖర్, జ్యోతి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో

కొడంగల్ రూరల్: విద్యాశాఖలో ఏళ్లతరబడి పనిచేస్తున్న సర్వశిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా జ్ఞానోదయం కల్పించాలని కోరుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎస్ఎస్ఏ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



పరిగి: రాధాకృష్ణ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జాక్ సభ్యులు



కొడంగల్ రూరల్: సర్వేపల్లి చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆర్థిక సహాయం

పెద్దేముల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దేముల్ మండలం జయరాంతండాలో సోమవారం రాత్రి జాదవ్ ప్రభుకుమార్ ఇల్లు కూలి పోయింది. దీంతో అదే తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జయరాం నాయక్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో పాషాపూర్ సర్పంచ్ భరత్ కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కొందుర్గు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ అమిత జోసెఫ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. ఆశలకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ప్రమాదబీమా కింద రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సమస్యల సాధనకు ఈ నెల 11న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేపడుతున్నట్లు వారు తెలిపారు.



కొడంగల్ రూరల్: ఉపాధ్యాయుడు సిద్దు మల్లేశ్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి



చిట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



పెద్దేముల్ మండలం నుంచి సన్మానం పొందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు



బంట్వారం: ప్రశంసా పత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు



బషీరాబాద్: ఉత్తమ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, శాంత్‌కుమార్, ఎల్లప్ప, గాయత్రి



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, విద్యాధికారి రేణుకాదేవి తదితరులు

ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

టీచర్లు సమసమాజ నిర్మాతలు: వక్తలు

విధి నిర్వహణలో జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, విద్యాధికారి రేణుకాదేవి తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందజేయగా.. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, వారు సమసమాజ నిర్మాతలు అని కొనియాడారు. - సాక్షి, నెట్‌వర్క్



యాలాల: ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా



బొంరాస్‌పేట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మండల ఉపాధ్యాయ సంఘం



కొడంగల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



పూడూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీటీసీ మస్రత్ అదిల్ అహ్మద్ తదితరులు



మర్పల్లి: ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న టీచర్లు



కుల్కచర్ల: సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీచర్లు